సాక్షి వరంగల్

7

గురువారం | 6 | జూన్ | 2024



కొనసాగుతున్న 'ఎమ్మెల్సీ' కౌంటింగ్

నేటి ఉదయం తేలనున్న మొదటి ప్రాధాన్యత ఓట్ల ఫలితం

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ బుధవారం నల్లగొండలో ప్రారంభమైంది. 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. - 8లో▸ -నల్లగొండ

న్యూస్‌రీల్

హరితహారానికి సిద్ధం కావాలి : జెడ్పీ సీఈఓ



దుగ్గొండి: హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామనర్సరీ, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచారు, ఏ రకాలు ఉన్నాయి, గ్రామంలోని గృహాల సంఖ్య తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ లెక్కల అరుంధతి, పంచాయతీ కార్యదర్శి వైనాల రాజు, ముస్కు రాజు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

నర్సంపేట రూరల్: నర్సంపేట డివిజన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రావు ఆదేశాల మేరకు ఏఈఎస్ మురళీధర్ సమక్షంలో వాహనాలకు బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో నర్సంపేటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, మరిన్ని వివరాల కోసం నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి



నర్సంపేట: సమాజంలో సగభాగమైన మహిళలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు చట్టాలను సక్రమంగా అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సీపీఐ కాలనీలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షురాలు చెట్టు మమత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కవిత మాట్లాడారు. 1954లో ఏర్పడిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా హక్కులు, సంక్షేమం, చట్ట సభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. గిరిజన, దళిత మహిళలపైన అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో అయితే శ్రీకళ, వడ్లకొండ యశోద, హంస మంజుల, గుంటి ఉపేంద్ర, స్వరూప, అమూల్య, దివ్య, ప్రమీల, పద్మ, సరిత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శులకు గాయాలు

గీసుకొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు గాయలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గీసుకొండ ఎంపీడీఓ కార్యాలయానికి జెడ్పీ సీఈఓ వస్తున్నారని, త్వరగా రావాలంటూ అధికారులు మెస్సేజ్ పెట్టడంతో నందనాయక్, ధర్మారం తండా పంచాయతీ కార్యదర్శులు సహజ, లావణ్య బుధవారం ఉదయం 11.30 గంటలకు ఆటోలో ఎంపీడీఓ కార్యాలయానికి బయలుదేరి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో ఊకల్ క్రాస్ రోడ్డు సమీపానికి చేరుకుంటుండగా వరంగల్ వైపు నుంచి కారు అతివేగంగా ఎదురుగా వచ్చింది. దీంతో డ్రైవర్ ఆటోను పక్కకు తిప్పే క్రమంలో అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శుల తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


వేయిస్తంభాల ఆలయంలో శివ కల్యాణం

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో బుధవారం శివ కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠ శర్మ, అర్చకుడు ప్రణవ్ రుద్రేశ్వరి, రుద్రేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను నాట్య మండపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గోధుమల ప్రేమ్‌కుమార్, లింగబత్తిని రామకృష్ణ పాల్గొన్నారు.

అసలేం జరిగింది?

వరంగల్ లోక్‌సభ ఫలితాలపై పార్టీల పోస్ట్‌మార్టం

- గెలిచినా.. కడియం కావ్యకు తగ్గిన ఓట్లు
- హ్యాట్రిక్ విజయాల నుంచి అట్టడుగుకు బీఆర్ఎస్
- 2019, 2023 పోలింగ్‌తో పోలిస్తే పుంజుకున్న బీజేపీ
- వరంగల్ ఓటర్ల విలక్షణ తీర్పుపై సర్వత్రా చర్చ



సాక్షిప్రతినిధి, వరంగల్: రాజకీయ చైతన్యం, పోరాట పటిమ కలిగిన వరంగల్ ప్రజలు, ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులు, మేధావుల నిర్ణయం రాజకీయ పార్టీలను ఆలోచింపజేస్తున్నది. ఒక్కో ఎన్నికలో ఒక్కో రకంగా తీర్పునిచ్చే విలక్షణ ఓటరు నాడీ.. గెలిచిన, ఓటమి చెందిన వారికి అంతుపట్టడం లేదు. ఫలితంగా 2019 పార్లమెంట్ ఎన్నికలు మొదలు.. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పుపై ప్రధాన రాజకీయపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. అంతుపట్టని వరంగల్ ఓటరు మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీపై మూడు ఎన్నికల్లో మూడు రకాలుగా వ్యవహరించిన తీరు ఆ పార్టీల నాయకత్వాలను ఆలోచనలో పడేసింది.

మూడు ఎన్నికలు.. మూడు రకాల తీర్పులు..

2019 లోక్‌సభ.. 2023 శాసనసభ.. 2024 లోక్‌సభ.. ఎన్నికల్లో ఓటర్లు మూడు రకాలుగా వ్యవహరించారు. 2019లో బీఆర్ఎస్‌ను ఆకాశానికెత్తితే.. 2024కి వచ్చే సరికి మూడో స్థానానికి పరిమితం చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 2,61,816 ఓట్లకే పరిమితమైన కాంగ్రెస్.. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో 6,63,556 ఓట్లు సంపాదించుకుంది. అయితే, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన 6,63,556 మందిలో.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 5,81,294 మందే కాంగ్రెస్ వైపు నిలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య 2,20,339 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే.

కాగా, 6 నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లతో పోలిస్తే 82,262 మంది ఓటర్లు ఇతరుల వైపు చూపినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏడు సెగ్మెంట్ల నుంచి 6,12,027 ఓట్లను బీఆర్ఎస్ సాధించగా.. ఆ పార్టీ అభ్యర్థి పసునూరి దయాకర్‌కు 3,50,211 ఓట్ల ఆధిక్యత రావడం అప్పట్లో రాష్ట్రంలో రికార్డు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ (5,12,620 ఓట్లు) ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన (6,63,556 ఓట్లు) ఓట్లతో పోలిస్తే 1,50,936 తేడాతో వెనుకబడి పోయింది. ఫలితంగా 6 సెగ్మెంట్లలో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి చెందారు. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి ఓటర్లు 2,32,033 ఓట్లతో బీఆర్ఎస్‌ను మూడో స్థానంలో నిలిపారు. ఈ రెండు పార్టీలు, మూడు ఎన్నికలను పరిశీలిస్తే బీజేపీ బాగా పుంజుకున్నట్లు కనిపిస్తోంది. 2019 ఎంపీ ఎన్నికల్లో 83,445 ఓట్లకు పరిమితమైన బీజేపీ.. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏడు సెగ్మెంట్లలో ఆ పార్టీ అభ్యర్థులు 1,48,480 ఓట్లను సాధించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ఓటమి చెందినా.. 3,60,955 ఓట్లను సాధించారు. 2019, 2023 ఎన్నికలతో పోలిస్తే బీజేపీ బాగా బలపడినట్లు కనిపిస్తోంది.

2019 వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు..

బీఆర్ఎస్	6,12,027
కాంగ్రెస్	2,61,816
బీజేపీ	83,455

2024 ఎన్నికల్లో

బీఆర్ఎస్	2,32,033
కాంగ్రెస్	5,81,294
బీజేపీ	3,60,955

2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లు..

బీఆర్ఎస్	5,12,620
కాంగ్రెస్	6,63,556
బీజేపీ	1,48,480

2019 వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి వచ్చిన ఓట్లు..

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్	94,327	42,687	8,403
పాలకుర్తి	92,437	39,745	5,956
పరకాల	87,567	39,433	8,872
వరంగల్ తూర్పు	85,873	28,976	19,437
వరంగల్ పశ్చిమ	62,669	33,417	17,371
వర్ధన్నపేట	97,526	33,846	13,599
భూపాలపల్లి	91,628	43,712	9,817

2024 వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ....

అసెంబ్లీ సెగ్మెంట్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్	98,145	43,720	40,332
పాలకుర్తి	87,293	47,878	28,452
పరకాల	76,400	36,477	44,841
వరంగల్ పశ్చిమ	63,400	19,680	60,611
వరంగల్ తూర్పు	66,627	20,360	74,581
వర్ధన్నపేట	94,238	31,345	57,427
భూపాలపల్లి	89,463	31,360	49,631
పోస్టల్ బ్యాలెట్లు	5,728	1,213	5,080

2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్	93,917	1,01,696	4,984
పాలకుర్తి	1,26,848	79,214	4,146
పరకాల	72,573	64,632	38,735
వరంగల్ పశ్చిమ	72,649	57,318	30,826
వరంగల్ తూర్పు	67,757	52,105	42,783
వర్ధన్నపేట	1,06,696	87,238	12,275
భూపాలపల్లి	1,23,116	70,417	14,731

ఎక్కడ పెరిగింది.. ఎక్కడ తగ్గింది?

మంగళవారం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడితో 22 రోజుల ఉత్కంఠకు తెరపడింది. అయితే, ఫలితాల తీరు మాత్రం మూడు ప్రధాన పార్టీలను ఆలోచనలో పడేసిందని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు. 2019 లోక్‌సభ,.. 6 నెలల కిందటి అసెంబ్లీ, ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ అన్ని పార్టీల్లో చర్చ జరుగుతోంది. గెలుపోటములు తేలిపోయినా.. ఓటింగ్ శాతం ఎక్కడ పెరిగింది? ఎక్కడ తగ్గింది? హెచ్చు తగ్గులకు కారణాలు ఏమిటి? అన్న పోస్ట్‌మార్టం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను వరంగల్ పార్లమెంట్‌కు సంబంధించిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నాయకులు చర్చ జరుపుతుండడం హాట్‌టాపిక్‌గా మారింది. ఎన్నికల్లో గెలుపొందినా ఇంకా మెజార్టీ రావాల్సి ఉండేనన్న చర్చ కాంగ్రెస్ నేతల్లో ఉండగా.. అగ్రనాయకత్వం రంగంలోకి దిగినా ఆశించిన ఫలితాలు రాలేదని బీజేపీ, బీఆర్ఎస్ మదనపడతున్నాయి. ఫలితాలపై బూత్‌ల వారీగా సమీక్ష జరిపేందుకు పార్టీల ముఖ్యనేతలు ఆసక్తి చూపుతుండటం చర్చనీయాంశంగా మారింది.

ఎక్కడ అనుకూలం.. ఎందుకు ప్రతికూలం

- ఓటమిపై బీజేపీ, బీఆర్ఎస్ పోస్టుమార్టం
- సత్తా చాటని అత్యధిక స్వతంత్ర అభ్యర్థులు
- రెండు స్థానాల్లోనూ ఇండిపెండెంట్ల ప్రభావం అంతంతే
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, ఏడీఆర్‌పీల తర్వాత 'నోటా'కే ఓట్లు..

- సాక్షిప్రతినిధి, వరంగల్

- వివరాలు 8లో▸

గ్రూప్–1 ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించండి : కలెక్టర్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఈనెల 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి డిగ్రీ కళాశాలలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య హాజరై మాట్లాడారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే అధికారులకు టీజీపీఎస్సీ నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో 17 కేంద్రాల్లో 9,168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, పరీక్ష నిర్వహణకు సంబంధించి డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించాలని తెలి పారు. ప్రతీ కేంద్రం సీసీ కెమెరా నిఘాలో ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత

వరంగల్: పిటిషన్ గడువు ముగిసేవరకు వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాట్లతోపాటు ఎన్నికల సామగ్రిని కౌంటింగ్ ముగిసిన అనంతరం సహాయ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కలెక్టర్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్‌లోని జిల్లా వేర్‌హౌస్ గోడౌన్ నంబర్ 17లో భద్రపరచి, సీల్ వేసినట్లు తెలిపారు. 45రోజుల ఎన్నికల పిటిషన్ గడువు ముగిసేవరకు ఎన్నికల సామగ్రిని పటిష్టభద్రత, నిత్యం పర్యవేక్షణలో ఉంచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, సంధ్యారాణి, ఏఆర్ఓలు అశ్విని తానాజీ వాకడే, సిదం దత్తు, కృష్ణవేణి, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విజయ్‌సాగర్, రాజేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో సిద్ధార్థకు ద్వితీయ బహుమతి

చెన్నారావుపేట: డ్రాయింగ్ పోటీల్లో ఉప్పరపల్లి హైస్కూల్ పదో తరగతి విద్యార్థి సీహెచ్.సిద్ధార్థ జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి పొందినట్లు హెచ్ఎం తేజావత్ జయ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 3న వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, వరంగల్ జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా డ్రాయింగ్ (చిత్రలేఖనం)పోటీలు నిర్వహించాయి. పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన సిద్ధార్థ, గైడ్ టీచర్ గజవెల్లి సుందర్‌కు బుధవారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ షీల్డ్, సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ లావణ్య, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, కాలుష్యం, పర్యావరణ శాఖ ఇంజనీర్ సునీత పాల్గొన్నారు. కాగా, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మమత, మాధవి, మురళి, మోహన్‌రావు, కృష్ణ, రవీందర్, జాహేద్, ఇందిర తదితరులు వారిని అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సిద్ధార్థ

మరియపురానికి మరో అరుదైన గౌరవం

- రాష్ట్రస్థాయి పర్యావరణ అవార్డు ప్రదానం
- మాజీ సర్పంచ్ బాలిరెడ్డి కృషి ఫలితం

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామం మరియపురం మరో అవార్డుతో మెరిసింది. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న గ్రామపంచాయతీలను గుర్తించి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్రంలో రెండు పంచాయతీలకు అవార్డు ఇవ్వగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామపంచాయతీకి మొదటి అవార్డు, రెండో అవార్డును మరియపురం గ్రామానికి అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ఎంపీఓ ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లెల స్వప్నకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎ.శాంతికుమారి, ఈఎఫ్ఎస్‌టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.వాణిప్రసాద్ అందించారు. గడిచిన ఐదేళ్లుగా గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, పచ్చదనం, పరిశుభ్రతలో మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ముందు నిలిపేందుకు చేసిన కృషి ఫలితంగానే ఈ అవార్డు లభించిందని గ్రామస్తులు తెలిపారు.



రాష్ట్రస్థాయి పర్యావరణ పరిరక్షణ అవార్డును అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ

కొత్తూరు పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు

రాయపర్తి: మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రాష్ట్రస్థాయి గ్రీన్ చాపియన్ అవార్డు వచ్చిందని హెచ్ఎం, ఎంఈఓ నోముల రంగయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొల్యూషన్ అండ్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ విభాగం నుంచి ప్రథమ బహుమతి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ నోముల రంగయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయురాలు కొంక అనురాధ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్ఎం, ఎంఈఓ

వరద నిల్వకుండా చర్యలు చేపట్టండి

వరంగల్ అర్బన్: నగరంలో వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రెండు మూడ్రోజుల్లో కచ్చా కాల్వలు తవ్వించాలని ఆదేశించారు. 57, 58, 59 డివిజన్లలో ముంపు నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వరంగల్ కృష్ణ కాలనీ ప్రాంతంలో నీరు నిలిస్తే వెంటనే తొలగించాలన్నారు. బల్దియా సీఎంహెచ్‌ఓ రాజేశ్ పాల్గొన్నారు.

నేటినుంచి 19 వరకు 'బడిబాట'

కాశీబుగ్గ (కాళోజీ సెంటర్): జిల్లాలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 19 వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించనున్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలు, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, దివ్యాంగ పిల్లలకు కల్పించే వివిధ వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తారు. బాలికావిద్య ప్రాముఖ్యతను తెలియజేసి బాలికల నమోదును పెంచడం, 5వ తరగతి పూర్తి చేసిన వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, 7వ, 8వ తరగతి పూర్తిచేసిన వారిని ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తారు.



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

కార్యక్రమాల వివరాలు..

- 6వ తేదీన బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిజ్ఞ చేసి బడిబాట ర్యాలీ నిర్వహించాలి.
- 7న బడిఈడు పిల్లల ఇళ్లను సందర్శించి జాబితా తయారుచేయాలి.
- 8 నుంచి 10 వరకు ఇంటింటి ప్రచారంలో భాగంగా బడిబయటి పిల్లలు, దివ్యాంగ పిల్లలు, బడిఈడు గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రంలోని బడిఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పిస్తారు.
- 11న గ్రామసభలు నిర్వహించి 3 నుంచి 10 వరకు జరిగిన నమోదుపై చర్చిస్తారు.
- 12వ తేదీన ప్రజాప్రతినిధుల సమక్షంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేయనున్నారు.
- 13న ఎఫ్ఎల్ఎన్ పాటను విద్యార్థులకు వినిపించి, ఎఫ్ఎల్ఎన్/ఎల్ఐపీ క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టుల చార్ట్‌లను తరగతి గదుల్లో అంటిస్తారు.
- 14న ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు, ఉన్నత పాఠశాలల్లో బాలసభలు నిర్వహిస్తారు.
- 15న దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలు, భవిత కేంద్రాల్లో నమోదు చేస్తారు. కేజీబీవీల్లో బాలికలకు కల్పించే వసతుల గురించి తల్లిదండ్రులకు విశదీకరిస్తారు.
- 18న విద్యార్థులతో పాఠశాలల్లో మొక్కలు నాటిస్తారు. ఆంగ్ల మాధ్యమం గురించి తల్లిదండ్రులకు తెలియజేస్తారు
- 19న పాఠశాలల్లో స్పోర్ట్స్ డే సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర పోటీలు నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమం ఈనెల 19 వరకు కొనసాగుతుంది. బడిబయటి పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య బోధిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఈసారి టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

– వాసంతి, డీఈఓ

టీఎస్ ఐసెట్ మొదటి రోజు ప్రశాంతం



హనుమకొండలోని ఓ కేంద్రం వద్ద అభ్యర్థులు

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీఎస్ఐసెట్ ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్)లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. వరంగల్ రీజియన్‌లో హనుమకొండ, వరంగల్, నర్సంపేటలోని 8 పరీక్ష కేంద్రాల్లో ఈప్రవేశపరీక్ష నిర్వహించారు. మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించగా.. మొత్తం 1,554 మంది అభ్యర్థులకు 1,446 మంది హాజరైనట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. కాగా.. మొదట కాకతీయ యూనివర్సిటీలోని టీఎస్ ఐసెట్ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ శ్రీరాం వెంకటేశ్ ఉన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

వరంగల్‌లోని ఓ పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పరిశీలించారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, టీఎస్ ఐసెట్ కన్వీనర్ ఆచార్య నర్సింహాచారి వివిధ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. గురువారం ఒక సెషన్‌తో టీఎస్ ఐసెట్ ముగియనుంది.

యేసు కుటుంబానికి న్యాయం చేయాలి


ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

వాజేడు: మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి మృతి చెందిన ఇల్లెందుల యేసు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. సుమారు 3 వేల మంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. జగన్నాథపురం జంక్షన్ నుంచి జగన్నాథపురం గ్రామం వరకు జాతీయ రహదారిపై ఈ ర్యాలీ కొనసాగింది. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు(55) కొంగాల గ్రామ సమీపంలోని గుట్టపై సోమవారం వంట చెరుకు తేవడానికి వెళ్లిన సమయంలో మందు పాతర పేలడంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. మావోయిస్టులు అమర్చిన మందు పాతర మూలంగానే యేసు మృతి చెందాడని ఆరోపిస్తూ ఫ్లెక్సీలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మందుపాతర మూలంగా అమాయకుడు బలి అయ్యాడని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గెలుపోటములు సహజమే..

- ప్రశ్నించే గొంతుకగా సమస్యలపై ఉద్యమిస్తాం
- ప్రజాతీర్పును స్వాగతిస్తున్నాం
- బీఆర్ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు కవిత


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాలోత్ కవిత

మహబూబాబాద్: రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందినా ప్రజలకు సేవ చేస్తూ అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ప్రశ్నించే గొంతుకై ప్రజల తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎంపీగా.. పార్లమెంట్ సమావేశాల్లో బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వంటి అనేక అంశాలపై ప్రస్తావించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు భిన్నంగా వచ్చాయన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాలపై సమీక్షలు నిర్వహించుకుని ముందుకెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల తరఫున పోరాడతామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకన్న, నాయకులు భరత్ కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, కన్నా, ముత్యం వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాకుండా ఉత్తర తెలంగాణ జిల్లాలు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రజలకు కూడా పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ తెలిపారు. కేఎంసీకి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ ఆస్పత్రులతో పాటు కళాశాలలో జరిగిన అభివృద్ధి గురించి 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ఎంజీఎం

పదేళ్లలో 500 ఎంబీబీఎస్ సీట్ల పెరుగుదల

- ఐదు నూతన మెడికల్ కళాశాలలు
- అందుబాటులోకి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి
- కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి INTERVIEW


డాక్టర్ మోహన్ దాస్





ఉమ్మడి జిల్లాలో ఐదు నూతన మెడికల్ కళాశాలలు

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ. 1100 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి పనులు చివరి దశకు చేరుకున్నాయి. పదేళ్ల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు నూతన మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రాగా వాటి ద్వారా ఏకంగా 500 నూతన ఎంబీబీఎస్ సీట్లు పెరగడంతో పాటు 107 ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు 197కు పెరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏ మెడికల్ కళాశాలకు మంజూరు కాని ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ పీజీ సీట్లు కేఎంసీకి మాత్రమే మంజూరయ్యాయి. మొదటిసారి నెఫ్రాలజీ సూపర్‌స్పెషాలిటీ విభాగంలో ఐదు సూపర్ స్పెషాలిటీ సీట్లు సైతం దక్కాయి. అంతేకాకుండా రూ.150 కోట్ల పీఎంఎస్ఎస్‌వై నిధుల ద్వారా అత్యాధునిక 250 పడకలు సూపర్‌స్పెషాలిటీ విభాగంతో అందుబాటులోకి వచ్చాయి. మొత్తానికి పదేళ్లలో కాలంలో వైద్యరంగంలో టీచింగ్ ఆస్పత్రుల్లో పెను మార్పులు సంభవించాయి. ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నెల రోజుల్లో నోటిఫికేషన్ ఇవ్వనుంది.

డిసెంబర్ కల్లా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి..

రూ. 1100 కోట్ల వ్యయంతో చేపట్టి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి 24 అంతస్తుల నిర్మాణం పూర్తి జరిగింది. 9 అంతస్తుల్లో అంతర్గత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా పరికరాల మరమ్మతులతో సహా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఎల్‌అండ్‌టీ కంపెనీ ఆదేశించగా.. డిసెంబర్ కల్లా అందిస్తామని హామీ ఇచ్చింది.

మెరుగైన కార్డియాలజీ సేవలు..

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా కార్డియాలజీ సేవలు మెరుగుపడ్డాయి. క్యాథ్‌లాబ్ అందుబాటులోకి రావడం ద్వారా ప్రతి నెల 300 యాంజియోగ్రాములు, 50 స్టంట్‌లను విజయవంతంగా నిర్వహిస్తూ పేద రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. అలాగే, యురాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్ సర్జన్ విభాగాల్లో సైతం మెరుగైన సేవలందిస్తాం. అంతే కాకుండా ఆర్థోపెడిక్ విభాగంలో పెద్దఎత్తున మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేశాం.

కళాశాలకు నూతన భవనాలు, ఎక్సలెన్స్ కేంద్రాలు..

కాకతీయ మెడికల్ కళాశాలలో 200 సీట్ల ఉండగా 50 సీట్లు అదనంగా మంజూరు కావడంతో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 250కు చేరుకుంది. పెరిగిన ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా నాలుగు నూతన హాస్టళ్ల నిర్మాణంతో పాటు కళాశాలకు రీజినల్ ఎమర్జెన్సీ ట్రైనింగ్ కేంద్రం, స్కిల్ సెంటర్లు మంజూరయ్యాయి. అలాగే, రూ. 18 కోట్లతో అత్యాధునిక అకడమిక్ బ్లాక్ అందుబాటులోకి వచ్చింది.

సీకేఎం, జీఎంహెచ్ ఆస్పత్రుల్లో నూతన భవనాలు, పెరిగిన ప్రసవాలు..

ప్రసూతి సేవలకు పెద్ద దిక్కుగా ఉన్న హనుమకొండ జీఎంహెచ్, వరంగల్ సీకేఎం ఆస్పత్రుల్లో నూతన భవనాలు నిర్మించి సేవలు మెరుగుపరిచాం. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆయా ఆస్పత్రులకు వచ్చే గర్భిణుల సంఖ్య భారీగా పెరిగింది. ఆ మేరకు సేవలు అందిస్తున్నాం.

24 అంతస్తుల్లో 2032 పడకలు..

రూ. 1100 కోట్లతో సెంట్రల్ జైలు ప్రాంగణంలో 24 అంతస్తుల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఈ ఆస్పత్రిలో 21 విభాగాల్లో 2032 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రి అందుబాటులోకి వచ్చే క్రమంలో ప్రస్తుతం ఉన్న వైద్యులతో పాటు కొత్త వైద్యులను కూడా నియమించి అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం.

ఎంజీఎంను ఎంసీహెచ్‌గా మారుస్తారు..

ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిని మదర్ అండ్‌ చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్(ఎంసీహెచ్) గా మారుస్తాం. పిల్లల విభాగంతో పాటు రిస్కీ మెటర్నటీ సేవలు ప్రస్తుత ఎంజీఎంలో అందిస్తాం. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు తొలగించి పేద రోగులకు ధర్మశాలలు ఏర్పాటు చేయడంతో పాటు మార్చురీ సేవలు విస్తృతం చేస్తాం.

ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా టీ-హబ్ సేవలు..

వైద్యరంగంలో మెరుగైన సేవలందించే క్రమంలో ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన టీ-హబ్ ద్వారా విస్తృత సేవలందుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రి కేంద్రంలో, వరంగల్ జిల్లాలో నర్సంపేటలో, జనగామ జిల్లాలో జిల్లా కేంద్రంలో, భూపాలపల్లిలో జిల్లా కేంద్రంలో, ములుగు జిల్లా కేంద్రంలో టీ-హబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారు.

ప్రతి జిల్లా కేంద్రంలో పెరిగిన ఆస్పత్రుల పడకలు..

పదేళ్ల కాలంలో ప్రతి జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నెలకొల్పడం ద్వారా ఆయా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పరంగా వైద్యసేవలందుతున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 250 పడకల ఆస్పత్రి, భూపాలపల్లి జిల్లాలో 100 పడకల ఆస్పత్రి, నర్సంపేటలో 200 పడకల ఆస్పత్రి, ములుగులో ఏరియా ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ పెద్ద ఎత్తున పడకల సంఖ్య పెంచడంతో ప్రభుత్వ పరంగా వైద్యసేవలు మెరుగుపడ్డాయి. అలాగే, అర్బన్ ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు పెరిగాయి.

అంతర్మథనం



ఓటమిపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పోస్టుమార్టం

- ఎక్కడ అనుకూలం.. ఎందుకు ప్రతికూలమనే అంశాలపై విశ్లేషణ
- రెండు స్థానాల్లోనూ ఇండిపెండెంట్ల ప్రభావం అంతంతే..
- మహబూబాబాద్‌లో 'నోటా'ను మించిన స్వతంత్రుడు ఒక్కరే..
- పదివేల ఓట్ల మార్క్‌కు చేరిన బీఎస్పీ, ఇతర పార్టీలు

సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో విజేతలు సంబురాలు చేసుకుంటుండగా.. అపజయం పొందిన అభ్యర్థులు పార్టీల నేతలతో ఓటమికి కారణాలను విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) లోక్‌సభ స్థానాలు 2019లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కానీ, 2024ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. దీంతో బీఆర్ఎస్, బీజేపీలు అంతర్మథనంలో పడ్డాయి. ఆయాపార్టీల అగ్ర నాయకత్వం ముఖ్యనేతలు, ఇన్‌చార్జ్‌లతో వేర్వేరుగా ఓటమిపై పోస్టుమార్టం నిర్వహిస్తున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి లోపాలను సవరించుకుని.. ఆ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎత్తుగడలు వేయడంపై అభిప్రాయ సేకరణ చేస్తున్నాయి.

ఓటమిపై సమీక్షలు

వరంగల్‌లో కడియం కావ్య 5,81,294(పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి)ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి అరూరి రమేశ్‌పై 2,20,339 ఆధిక్యంతో గెలుపొందారు. మహబూబాబాద్‌లో మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ 6,12,774ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితపై 3,49,165ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. 2019లో బీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్‌కు వరంగల్‌లో 6.12లక్షలకు పైగా ఓట్లు, 3.5లక్షలకుపైగా మెజార్టీ రాగా అప్పటితో పోలిస్తే తాజా ఫలితాల్లో 3.80లక్షల ఓట్లను ఆపార్టీ కోల్పోయింది. కేవలం 2,32,033ఓట్లకు పరిమితమైంది. మహబూబాబాద్‌లో 2019లో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితకి 4,62,109ఓట్లు, 1,46,663ఓట్ల మెజార్టీ రాగా.. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీగా పోటీలో ఉన్నా ఆమెకు 2,63,609ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా, వరంగల్ బీజేపీ అభ్యర్థి చింత సాంబమూర్తికి 2019లో 83,777 ఓట్లే రాగా, ఈసారి ఆరూరి రమేశ్‌కు 3,60,955 ఓట్లు వచ్చాయి. ఓటు శాతం బీజేపీకి బాగా పెరిగింది. మహబూబాబాద్‌లో 2019లో 25,447ఓట్లు రాగా, తాజా ఎన్నికల్లో 1,10,444లకు పెరిగాయి. ఈ గణాంకాలు ఆధారంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఓటమి కారణాలపై లోతుగా సమీక్షలు చేసుకుంటున్నాయి.

'నోటా'ను దాటిన ఇండిపెండెంట్ ఒక్కరే..

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు అంతగా ప్రభావం చూపలేకపోయారు. వరంగల్ నుంచి మొత్తం 42మంది బరిలో ఉండగా 31మంది స్వతంత్రులు పోటీలో ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 23మంది అభ్యర్థులు ఉండగా, 11మంది స్వతంత్రులుగా బరిలో నిలిచారు. వరంగల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతో పాటు బీఎస్పీ, ఏడీఆర్‌పీ, ఏఎస్‌పీ, డీఎస్‌పీ, ఎంటీఆర్ఎస్‌పీ, ఆర్‌బీఐ, ఆర్‌పీసీ, జేఎంబీ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు పోను.. అంబోజు బుద్దయ్య(ఏడీఆర్‌పీ)కు 11,115, కల్పన పంజా (బీఎస్పీ)కి 9,327 ఓట్లు రాగా.. మిగతా 37 మందికి 'నోటా' కంటే తక్కువే వచ్చాయి. వరంగల్‌లో 'నోటా'కు 8,380 ఓట్లు వచ్చాయి. వివిధ పార్టీల నుంచి చేసిన ఆరుగురికి 1,664నుంచి 6,225ఓట్లు రాగా.. 17 మంది స్వతంత్రులకు 379నుంచి 1,003, మరో 14మందికి 1,025 నుంచి 1,660ఓట్లు వచ్చాయి. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతోపాటు బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, ఏడీఆర్‌పీ, జేజేపీ, డీఎస్‌పీ, జేడీపీ, ఎస్‌పీ, టీజేపీ, బీఐపీ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ చేశారు. ఇక్కడ 'నోటా'కు 6,591ఓట్లు రాగా.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు మినహాయిస్తే.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దుర్గ పాల్వంచకు 10,119ఓట్లు, కోనేటి సుజాత (బీఎస్పీ)కు 8,093 ఓట్లు రాగా.. మిగతా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు అందరికీ 'నోటా' కంటే తక్కువే వచ్చాయి. 13మందికి 1,125 నుంచి 4,062 ఓట్లు రాగా, చందా లింగయ్య (స్వతంత్ర)కు 5,100, అనిల్‌కుమార్ బోడ (స్వతంత్ర)కు 6,431 ఓట్లు వచ్చాయి.



సీఎం రేవంత్‌ను కలిసిన కావ్య

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిసిన వరంగల్ ఎంపీగా ఎన్నికైన కడియం కావ్య. చిత్రంలో మంత్రి కొండా సురే ఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజే ందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్ర కాశ్‌రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, సిరిసిల్ల రాజయ్య, ఝాన్సీ.

- హన్మకొండ

మంత్రి 'తుమ్మల'ను కలిసిన బలరాంనాయక్


మంత్రి తుమ్మలను కలిసిన ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డిలను బుధవారం సత్తుపల్లిలోని మంత్రి నివాసంలో కలిసిన మహబూబాబాద్ ఎంపీగా ఎన్నికైన పోరిక బలరాంనాయక్, చిత్రంలో ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రామచంద్రునాయక్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, నాయకులు నూకల నరేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. - మహబూబాబాద్ రూరల్

వ్యవసాయ బావిలో పడి వృద్ధుడి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం దేశాయితండా పంచాయతీ పరిధిలోని సీతతండాకు చెందిన రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతతండాకు చెందిన రైతు బానోతు గోవిందు(70) వరినారుకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. సాయంత్రం వరకు గోవిందు ఇంటికి రాలేదని బావి వద్దకు వెళ్లిన మనుమడు రవి చూడగా.. బావిలో శవమై కనిపించాడు. ఎస్సై ముత్యం రాజేందర్, కానిస్టేబుల్ చారి సిబ్బంది బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. మనుమడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న 'ఎమ్మెల్సీ' కౌంటింగ్


కౌంటింగ్ కేంద్రంలో కరచాలనం చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డి


బ్యాలెట్ పత్రాన్ని చూపుతున్న ఎన్నికల సిబ్బంది

ప్రశాంతంగా 'పట్టభద్రుల' ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్ ప్రారంభం

- సాయంత్రం 4 గంటల వరకు సాగిన బండిల్స్ కట్టే ప్రక్రియ
- 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం
- నేటి ఉదయం తేలనున్న ఫలితం

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి కౌంటింగ్ బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్స్‌కు తీసుకొచ్చారు. నాలుగు హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ గత నెల 27న జరిగింది. మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఈ ఎన్నికల్లో మొత్తం 4,63,839 ఓట్లకు గాను 3,36,013 ఓట్లు పోలయ్యాయి.

96 టేబుళ్లపై లెక్కింపు

బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ ప్రక్రియలో మొదటి రౌండ్ ఫలితం రాత్రి 12 గంటలకు వెలువడింది. 96 టేబుళ్లపై టేబులుకు వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్లను లెక్కిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 4 రౌండ్లలో పూర్తవుతుంది. ఈ ప్రకారం పోలైన 3,36,013 ఓట్లను లెక్కించడానికి 3 రౌండ్లలో టేబుల్‌కు వేయి ఓట్ల చొప్పున, 4వ రౌండ్‌లో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. 4 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తవుతుంది. గురువారం ఉదయం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల ఫలితం వెల్లడికానుంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

పోటీ చేసిన 52 మంది అభ్యర్థులకు సంబంధించిన ప్రత్యేక బాక్సులను ప్రతి టేబుల్‌పై ఉంచుతున్నారు. చెల్లని ఓట్లకు సంబంధించి మరో బాక్స్ ఉంచారు. ఇలా వెయ్యి ఓట్లలో ఒక్కో బ్యాలెట్ పేపర్‌ను తెరిచి ఎవరికి మొదటి ప్రాధాన్యత ఓటు పడిందో.. అక్కడి ఏజెంట్లకు చూపించి ఆ అభ్యర్థి బాక్సులో ఆ ఓటు పెడుతున్నారు. చెల్లని ఓటు వస్తే ఏజెంట్లకు చూపి చెల్లని ఓట్ల బాక్సులో వేస్తున్నారు. ఇలా ఆ టేబుల్‌పై మొదటి ప్రాధాన్యతలో వెయ్యి ఓట్లలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనేది లెక్క చేయడంతో పాటు చెల్లని ఓట్లు ఎన్ని అనేది లెక్క చేసి చూపుతారు. ఇలా 96 టేబుళ్లపై కౌంటింగ్ ప్రక్రియ సాగుతోంది.

మొదటి ప్రాధాన్యతలో గెలవకపోతే..

మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తయిన తర్వాత చెల్లని ఓట్లను తీసివేసి చెల్లిన ఓట్లలో సగానికి ఒక ఓటును కలుపుతూ గెలుపు టార్గెట్ నిర్ణయిస్తారు. ఆ టార్గెట్ ప్రకారం మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా మెజార్టీ వస్తే అతడిని గెలిచినట్లు ప్రకటిస్తారు. లేదంటే ఎలిమినేషన్ పద్ధతిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నారు.


కౌంటింగ్ కేంద్రానికి వస్తున్న నల్లగొండ కలెక్టర్, ఎస్పీ


బ్యాలెట్ పత్రాలను వేర్వేరు డబ్బాల్లో వేస్తున్న సిబ్బంది

మూగజీవాల పాలిట మృత్యుపాశాలు

- విద్యుత్ తీగలు తెగిపడి ఐదు ఎద్దుల మృతి


విద్యుత్ తీగ తెగిపడడంతో మృతి చెందిన ఎద్దులు

కాటారం(మహదేవపూర్): విద్యుత్ తీగ మూగజీవాల పాలిట మృత్యుపాశంగా మారింది. మేతకోసం వెళ్లిన ఎద్దులపై విద్యుత్ వైరు తెగిపడటంతో ఐదు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గావిడి మల్లయ్య, తడండ్ల లక్ష్మయ్య, ఎర్రయ్య, గొరవేని కిష్టయ్యకు చెందిన ఎద్దులు రోజులాగే పశుగ్రాసం కోసం గ్రామ శివారులోని చేలలోకి వెళ్లాయి. ఈక్రమంలో పశువులు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడటంతో ఐదు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయం జీవనోపాధిగా బతుకుతున్న తమకు ఎద్దులు మృతి చెందడటంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

మాన్‌సింగ్‌తండాలో దుక్కిటెద్దులు..

ములుగు రూరల్: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మాన్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్‌సింగ్ తండాకు చెందిన విప్‌సింగ్, ఆంగోత్ యాకుబ్‌లకు చెందిన రెండు దుక్కిటెద్దులు సమీప పొలంలోకి మేత కోసం వెళ్లాయి. ఈ క్రమంలో దుక్కిటెద్దులు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుషాక్‌తో చనిపోయాయి. మృతి చెందిన దుక్కిటెద్దుల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుదని బాధిత రైతులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు పరిహారం ఇప్పించాలని కోరారు.

'నీట్'లో శివాని విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: ఇటీవల విడుదలైన నీట్ ఎంట్రన్స్‌లో శివాని కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చగా బుధవారం కళాశాలలో వారిని అభినందించారు. కళాశాలకు చెందిన సీ.హెచ్ సాత్విక (611 మార్కులు), ఎస్. సాయి ప్రియ(535), వి. భావని(529), ఎస్.ప్రదీప్ (487),ఈ. కార్తీక్ (483), సీ.హెచ్. సాద్విక (481), ఎల్. అనూష(481), బి.లోకేష్ (477), ఎం.ముఖేష్ (477) మార్కులు సాధించినట్లు శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, ఎస్. రమేష్, మురళీధర్, వి. సురేష్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.